క్లుప్తంగా

రైతులకు నష్ట పరిహారం చెల్లించాలి



మొక్కజొన్న తోటను పరిశీలిస్తున్న నాయకులు

టేకులపల్లి: పంట నష్టంపై సమగ్ర సర్వే నిర్వహించి ఎకరానికి రూ.50 వేల నష్టపరిహారం చెల్లించాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర నాయకులు దుబాకుల ప్రసాద్, ఏఐకేఎంఎస్ నాయకులు ఎట్టి నరసింహారావు, భూక్యా హర్‌జ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం నాయకుల బృందం టేకులపల్లి మండలంలో మొక్కజొన్న, మిర్చి పంటలను పరిశీలించారు. రైతులతో మాట్లాడారు. మండలంలో చేతికి వచ్చిన మొక్కజొన్న, మిర్చి అకాల వర్షంతో ముద్దయిందని, మొక్కజొన్న పడిపోయిందని రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారని, ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో భూక్యా నర్సింగ్, రైతులు హరిసింగ్, కిసాన్, రమేష్, కాంతారావు, జంబో శ్రీను, లింగా సునావత్, బాల తదితరులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

పాల్వంచరూరల్: ముర్రేడు వాగు నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు పట్టుకున్నారు. ఇందుకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు. మండల పరిధి తోగ్గూడెం గ్రామ సమీపంలోని ముర్రేడు వాగు నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తుండగా ఆదివారం ఏఎస్‌ఐ సుధాకర్ పట్టుకున్నారు. ట్రాక్టర్ డ్రైవర్ ఇర్పా అశోక్‌పై కేసు నమోదు చేశారు.

కాంగ్రెస్ నాయకుడు చంద్రమౌళి మృతి



ఇల్లెందు: కాంగ్రెస్ నాయకుడు మాచర్ల చంద్రమౌళి (70) మృతి ఆదివారం చెందారు. కొంతకాలంగా ఆయన గుండె, శ్వాస వ్యాధితో బాధపడుతూ హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో వైద్యం పొందుతున్నారు. ఆయనకు భార్య, కుమారులు ఉన్నారు. చంద్రమౌళి మృతి పట్ల మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ మడత వెంకట్‌గౌడ్, కనగాల పేరయ్య, ఎమ్మెల్యే కోరం కనకయ్య, మడుగు సాంబమూర్తి, దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, జానీపాషా తదితరులు సంతాపం వ్యక్తం చేశారు.

ప్రభుత్వ ఉపాధ్యాయుడు..



నివాళులర్పిస్తున్న ఎంఈఓ, నాయకులు

టేకులపల్లి: మండలంలో పని చేస్తున్న ప్రభుత్వ ఉపాధ్యాయుడు గుండెపోటుతో మృతి చెందారు. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం... బోడు గ్రామానికి చెందిన పాడెం వెంకటేశ్వర్లు (60) ఎర్రాయిగూడెం ప్రాథమిక పాఠశాల ఎల్‌ఎఫ్‌ఎల్ హెచ్‌ఎంగా పని చేస్తున్నారు. బూడిదగడ్డలో నివాసం ఉంటున్నారు. ఆదివారం ఇంట్లో గుండెపోటు వచ్చి కింద పడిపోయారు. కుటుంబ సభ్యులు ప్రైవేట్ ఆసుపత్రికి, అక్కడి నుంచి కొత్తగూడెం ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు. మృతుడికి భార్య సుజాత ఉన్నారు. సొంతూరు బోడు గ్రామంలో అంత్యక్రియలు నిర్వహించారు. టేకులపల్లి ఎంఈఓ అజ్మీర జగన్ నాయక్, కాంప్లెక్స్ హెచ్‌ఎంలు, టేకులపల్లి మండల ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాలు, రాజకీయ పార్టీల నాయకులు మృతదేహాన్ని సందర్శించి సంతాపం తెలిపారు. కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.



శివరాత్రి ఉత్సవం షురూ..

ప్రాచీన దేవాలయంగా ఖ్యాతి ● నేరుగా శివలింగంపై సూర్యకిరణాలు పడే ఏకైక ఆలయం





పాల్వంచలో ఆత్మలింగేశ్వరాలయం, ఆలయంలో పసుపుకొట్టి ఉత్సవాలు ప్రారంభిస్తున్న కమిటీ సభ్యులు, భక్తులు

పాల్వంచ: పాల్వంచ పట్టణంలోని ప్రముఖ శ్రీఆత్మలింగేశ్వరాలయానికి రాష్ట్రంలోనే ప్రత్యేకత ఉంది. సూర్యకిరణాలు నేరుగా శివలింగంపై పడే ఏకైక ఆలయం. చింతల చెరువు పక్కన ఉన్న ఈ ఆలయాన్ని కాకతీయుల కాలం 1324 సంవత్సరంలో వెలసినట్లు చరిత్రకారులు చెబుతుంటారు. ఈ ఆలయంలో శివరాత్రికి రెండు వారాలు, దసరా పండుగ సందర్భంలో రెండు వారాలు సూర్యకిరణాలు నేరుగా ఆలయంలోని శివలింగంపై పడతాయి. ఈ సమయంలో స్వామి వారిని దర్శించుకుంటే కోటి లింగాలను దర్శించిన, పూజించిన ఫలితం వస్తుందని భక్తులు విశ్వసిస్తారు. ఆలయంలో ఈనెల 23వ తేదీ నుంచి 26 వరకు శివలీలా కల్యాణ మహోత్సవాలు అంగరంగ వైభవంగా జరగనున్నాయి. 23న గోపూజ, గణపతి పూజ, పుణ్యాహవచన, పంచగవ్యములతో ఆలయశుద్ధి, అఖండ దీపారాధన, పసుపు కొట్టడం, తలంబ్రాలు కలపడం వంటి పూజలతో ప్రారంభించారు. 24న ఆత్మలింగేశ్వర స్వామికి అభిషేకం, సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి పంచామృతాభిషేకం, 25న రుద్రాభిషేకం, 26న కాశీ నుంచి తెప్పించిన 27 శివలింగాలకు 27 మంది దంపతులచే అభిషేకాలు, సాయంత్రం శివలీలా కల్యాణ మహోత్సవం నిర్వహించనున్నారు. ఈ మేరకు ఏర్పాట్లు చేసినట్లు ఆలయ ధర్మకర్త మచ్చా శ్రీనివాసరావు ఆదివారం తెలిపారు.

పెద్దమ్మ తల్లి జాతర



బద్దు తండా సీతారామ గుట్ట వద్ద జాతర

టేకులపల్లి: బద్దు తండా పంచాయతీ సీతారామ గుట్టపై వెలిసిన పెద్దమ్మ తల్లి ఆలయంలో పెద్దమ్మతల్లి జాతర వేడుకలు ప్రారంభం అయ్యాయి. ఆలయ పూజారి భూక్యా సీతారామ స్వామి ఆధ్వర్యంలో ఆదివారం రథయాత్ర నిర్వహించారు. అంగరంగ వైభవంగా అమ్మవారు గుడిలోకి ప్రవేశించారు. ఉమ్మడి జిల్లాతో పాటు ఇతర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. ఈనెల 26 వరకు జాతర మహోత్సవం జరగనుంది.

ఎమ్మెల్యే కూనంనేనికి సన్మానం



కూనంనేనిని సన్మానిస్తున్న దృశ్యం

సూపర్‌బజార్(కొత్తగూడెం): భారత అథ్లెటిక్ సంఘం ఈసీ మెంబర్, తెలంగాణ రాష్ట్ర అథ్లెటిక్ అసోసియేషన్ సెక్రటరీ కె.సారంగపాణి ఆదివారం కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావును మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. సారంగపాణి మాట్లాడుతూ.. జిల్లా నుంచి చాలామంది క్రీడాకారులు అథ్లెటిక్స్ విభాగంలో జాతీయ, అంతర్జాతీయ పోటీలలో పథకాలు సాధించినట్లు చెప్పారు. జిల్లాలో సింథెటిక్ ట్రాక్‌తో కూడిన డిస్ట్రిక్ట్ గ్రౌండ్ ఏర్పాటుకు ఎమ్మెల్యేతో చర్చించినట్లు తెలిపారు. ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారని సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అథ్లెటిక్ అసోసియేషన్ సెక్రటరీ మహీధర్, జాయింట్ సెక్రటరీ మల్లికార్జున్, న్యూస్టార్ అథ్లెటిక్స్ క్లబ్ ప్రెసిడెంట్ ఎండీ బాబ్జీ, సెక్రటరీ అమీత్ కుమార్, అంతర్జాతీయ అథ్లెటిక్స్ క్రీడాకారుడు ఎం.నరేష్, కోచ్‌లు నాగరాజు, వేణు, హనుమంతు, క్రీడాకారులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా గురుకుల ప్రవేశ పరీక్ష



పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థుల తల్లిదండ్రులు

ఇల్లెందురూరల్: సుదిమళ్ల గిరిజన గురుకుల పాఠశాల, కళాశాలల్లో గురుకుల పాఠశాలల అర్హత ప్రవేశ పరీక్ష ఆదివారం ప్రశాంతంగా జరిగింది. పరీక్ష రాసేందుకు మొత్తం 616 మంది దరఖాస్తు చేసుకోగా 601 మంది హాజరయ్యారు. పరీక్ష నిర్వహణలో అవాంతరాలు చోటుచేసుకోకుండా పరీక్ష కేంద్రం వెలుపల పోలీసు సిబ్బంది, లోపల పరీక్ష నిర్వాహకులు జాగ్రత్తలు తీసుకున్నారు. ఇదిలా ఉండగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న సమయంలో రెండు, మూడుసార్లు దరఖాస్తు చేసుకోవడం, ఆదాయ ధృవీకరణ పత్రం సక్రమంగా లేకపోవడం వంటి కారణాలతో ఇల్లెందు పరీక్ష కేంద్రానికి కేటాయించిన వారిలో ఐదుగురు విద్యార్థులను పరీక్షకు అనర్హులుగా ప్రకటించారు. ఈ విషయం పరీక్ష కేంద్రం వద్దకు వచ్చిన తరువాతే తెలియడంతో విద్యార్థులు, వారి వెంట వచ్చిన తల్లిదండ్రులు నిరుత్సాహంతో వెనుతిరిగారు. తమ పిల్లలను గురుకుల పాఠశాలల్లో అర్హత పరీక్ష రాయించేందుకు తల్లిదండ్రులు కూడా గురుకుల పాఠశాల వద్దకు తరలివచ్చారు. భానుడు తన ప్రతాపం చూపిస్తుండటంతో వీరంతా పాఠశాల సమీపంలోని చెట్ల కింద గుంపులుగా కూర్చుండిపోయారు.

అబద్ధపు ప్రచారాన్ని తిప్పికొట్టండి..



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాందాస్ నాయక్



ఎన్నికైన జర్నలిస్టు కమిటీ సభ్యులు

జూలూరుపాడు: కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్‌ఎస్, బీజేపీ చేస్తున్న అబద్ధపు ప్రచారాన్ని ప్రజలు తిప్పికొట్టాలని వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ పిలుపునిచ్చారు. ఆదివారం జూలూరుపాడు కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వంపై బీజేపీ, బీఆర్‌ఎస్ బురద జల్లే ప్రయత్నం చేస్తున్నాయని ఆరోపించారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం రూ.7 లక్షల కోట్లు అప్పు చేసిందని, ఆర్థికంగా ఇబ్బందులు ఉన్నప్పటికీ రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ, రైతు భరోసా పథకాన్ని అమలు చేస్తున్నట్లు చెప్పారు.

రైతులకు రూ.22 వేల కోట్లు రుణమాఫీ చేయడంతోపాటు, రైతు భరోసా పథకం కింద ఎకరానికి రూ.12,000, ధాన్యానికి క్వింటాకు రూ.500 బోనస్ ఇస్తున్నట్లు చెప్పారు. దేశంలో ఏ రాష్ట్రం కులగణన చేపట్టే సాహసం చేయలేదని, ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ ఇచ్చిన మాట ప్రకారం తెలంగాణ రాష్ట్రంలో కులగణన చేపట్టిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కిందన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు న్యాయం చేయాలనే కులగణన సర్వే నిర్వహించడం జరిగిందని, బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ అసెంబ్లీలో చట్టబద్ధత కల్పించడం జరిగిందన్నారు. రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా ఇందిరమ్మ పాలన కొనసాగుతోందన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులకు గెలిపించాలని కోరారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ముగియగానే ఇందిరమ్మ ఇళ్ల ప్రక్రియ ప్రారంభం అవుతుందన్నారు. అనంతరం జర్నలిస్టుల సంఘం నూతన మండల కమిటీ సభ్యులకు ఎమ్మెల్యే రాందాస్ నాయక్ శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో లేళ్ల వెంకటరెడ్డి, మాలోత్ మంగీలాల్ నాయక్, దుద్దుకూరి మధుసూదన్ రావు, రోకటి సురేష్, పొన్నెకంటి సతీష్ కుమార్, బానోత్ లాలు నాయక్, లకావత్ లచ్చు నాయక్, వేల్పుల నరసింహారావు, తాళ్లూరి అచ్చయ్య, బానోత్ బాబు, గోపు రామకృష్ణ, బానోత్ శాంతిలాల్ తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల కమిటీ ఎన్నిక

జర్నలిస్టుల నూతన మండల కమిటీ ఎన్నిక జూలూరుపాడులో ఆదివారం నిర్వహించారు. మండల అధ్యక్షుడిగా వురిమెళ్ల పూర్ణచందర్‌రావు, ఉపాధ్యక్షుడిగా మోదుగు ప్రభాకర్, ప్రధాన కార్యదర్శిగా బండ్ల వెంకటేశ్వర్లు, సహాయ కార్యదర్శిగా షేక్ సిద్ధిక్, కోశాధికారిగా సవడం వెంకటేశ్వర్లు ఎన్నికయ్యారు. అదేవిధంగా గౌరవ సలహాదారులుగా పెండ్యాల విజయభాస్కర్, గుండా సత్యనారాయణ, బాపట్ల మురళీలను ఎన్నుకున్నారు.

హామీల అమలులో కాంగ్రెస్ విఫలం



కరపత్రాలు అందజేస్తున్న నాయకులు

కొత్తగూడెంఅర్బన్: ఉద్యోగులకు, నిరుద్యోగులకు ఇచ్చిన హామీలు అమలు చేయడంలో కాంగ్రెస్ విఫలం అయిందని లక్ష్మీదేవిపల్లి బీజేపీ మండల అధ్యక్షుడు మాలోత్ గాంధీ నాయక్ విమర్శించారు. ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా మండలంలోని ప్రశాంతినగర్, హేమచంద్రాపురం, లక్ష్మీదేవిపల్లి ఏరియాలో ఓటర్ల ఇళ్లకు వెళ్లి ఎమ్మెల్సీ అభ్యర్థి సరోత్తమ్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని కోరారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ.. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం, గతంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం రెండు అన్నివర్గాల ప్రజలను మోసగించాయని విమర్శించారు. పేద విద్యార్థులకు ఇచ్చిన హామీ మేరకు విద్యా భరోసా కార్డు ఇవ్వలేదన్నారు. బీఆర్‌ఎస్ 317 జీఓతో ఉద్యోగులను ఇబ్బంది పెట్టిందన్నారు. ఉపాధ్యాయుల, అధ్యాపకుల సమస్యలు పరిష్కారం కావాలంటే బీజేపీ అభ్యర్థి సరోత్తమ్‌రెడ్డిని గెలిపించాలన్నారు.

మంత్రివర్గంలో చోటు కల్పించండి..



మాట్లాడుతున్న దుర్గాప్రసాద్

జూలూరుపాడు: రాష్ట్ర మంత్రివర్గంలో బంజారా సామాజిక వర్గానికి అవకాశం కల్పించాలని భారతీయ గోర్ బంజారా పోరాట సమితి ఉమ్మడి ఖమ్మం జిల్లా అధ్యక్షుడు బానోత్ దుర్గాప్రసాద్ అన్నారు. ఆదివారం జూలూరుపాడులో మాట్లాడుతూ... ఉమ్మడి ఖమ్మం జిల్లాలో బంజారా సామాజిక వర్గానికి చెందిన జిల్లాలో ఒకే ఒక్క ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ ఉన్నందున ఆయనకు మంత్రి పదవి ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో గోర్ బంజారా పోరాట సమితి ఖమ్మం జిల్లా ప్రధాన కార్యదర్శి నాగరాజు చౌహాన్, వీరన్న, సేవ్యా, భావ్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థుల్లో పోటీతత్వం పెరగాలి




టాలెంట్ టెస్ట్‌కు హాజరైన విద్యార్థులు

ఇల్లెందు: విద్యార్థుల్లో పోటీతత్వం పెరిగినప్పుడే ప్రతిభ వెలుగులోకి వస్తుందని సీపీఐ రాష్ట్ర సమితీ సభ్యుడు కె.సారయ్య అన్నారు. ఆదివారం ఇల్లెందులోని సాహితీ జూనియర్ కళాశాలలో నిర్వహించిన టాలెంట్ టెస్ట్‌ను ఆయన ప్రారంభించారు. ఇలాంటి టాలెంట్ టెస్టుల వల్ల విద్యార్థుల్లో బోర్డు పరీక్షలు అలవాటు పడతాయన్నారు. వారిలో భయాందోళనలు తొలగిపోయే అవకాశం ఉందన్నారు. ప్రతీ విద్యార్థి కష్టపడి చదువుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జి.రాంబాబు, ఉమ్మగాని హరీష్, ఎస్.సాయి, అఖిల, అపర్ణ, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఘనంగా కోతకాలపు పండుగ



ప్రసంగిస్తున్న డాక్టర్ సునీల్ శ్రీధర్



హాజరైన క్రైస్తవులు

ఇల్లెందురూరల్: యేసుప్రభుకు మనస్ఫూర్తిగా సమర్పించే ఫలమే కోతకాలపు పండుగ అని ఇల్లెందు గ్రూప్ చైర్మన్ డాక్టర్ సునీల్ శ్రీధర్, కార్యదర్శి ఆముదాల ప్రసాద్ అన్నారు. మామిడిగూడెం చర్చిలో కోతకాలపు పండుగను ఆదివారం ఘనంగా నిర్వహించారు. చర్చిలో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మంచిని ప్రేమించి మానవత్వాన్ని ప్రదర్శించడం భక్తికి నిదర్శనం అన్నారు. యేసు ప్రభువుని నమ్ముకున్న వారు ఆస్తులు లేకున్నా భక్తిభావంతో ధనవంతులుగానే వర్ధిల్లుతారని చెప్పారు. ఏడాదిపాటు సంపాదించిన సొమ్ములో దశమ భాగం నిత్యం ఆరాధించే ప్రభువైన యేసుకు సంతోషంగా సమర్పించుకుంటారని చెప్పారు. అనిల్‌కుమార్, తోకల ప్రతాప్, గుర్రం అశ్విన్‌కుమార్, స్వామిదాసు, పిల్లి శ్రీనివాస్, తోకల ఇమ్మానియేలు పాల్గొన్నారు.

సొంత భవనాలు కరువు..!

- ప్రభుత్వ విధులు నిర్వహించేందుకు ఉద్యోగుల పాట్లు
- ప్రజలకు సైతం తప్పని తిప్పలు
- పట్టించుకోని ఉన్నతాధికారులు



పాఠశాల పాతభవనంలో కొనసాగుతున్న తహసీల్దార్, ఎంపీడీఓ కార్యాలయాలు

సుజాతనగర్: పాలనా సౌలభ్యం కోసం మండలాలను ఏర్పాటు చేసినా అందుకనుగుణంగా ప్రభుత్వ కార్యాలయాలకు సొంత భవనాలు లేకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు. సుజాతనగర్ మండలం ఏర్పాటై తొమ్మిదేళ్లు. అయినా నేటికీ ప్రభుత్వ కార్యాలయాలకు సొంత భవనాలు లేవు. మండలంలో 20 గ్రామ పంచాయతీలు మరో 15 అనుబంధ గ్రామాలున్నాయి. మండల కేంద్రంలో ముఖ్యంగా తహసీల్దార్, ఎంపీడీఓ, వ్యవసాయ శాఖ, నీటిపారుదల, మహిళా సమాఖ్య తదితర కీలక శాఖల కార్యాలయాలకు సొంత భవనాలు లేక అరకొర వసతులతో అటు ఉద్యోగులు, ఇటు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఏ ఒక్క కార్యాలయానికి కూడా పక్కా భవనాలు లేవు. ఇప్పటికీ ప్రభుత్వ కార్యాలయాలకు పక్కా భవనాలు ఏర్పాటు చేయకపోవడంతో పాత పాఠశాల భవనాలు, అద్దె భవనాల్లోనే కార్యకలాపాలు కొనసాగిస్తున్న పరిస్థితి. 2016లో మండలం ఏర్పాటైనా ఇప్పటి వరకు పక్కా భవనాలపై ఉన్నధికారులు దృష్టి సారించడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు.

ఓ పక్క తహసీల్దార్.. మరోపక్క ఎంపీడీఓ...

తహసీల్దార్ కార్యాలయం, ఎంపీడీఓ కార్యాలయాలకు సొంత భవనాలు లేకపోవడంతో ఈ రెండు కార్యాలయాలు పాత హైస్కూల్ భవనంలోనే పక్కపక్కనే కార్యకలాపాలు కొనసాగిస్తున్నాయి. భవనం ఇరుకు గదుల్లో ఉండటంతో ఉద్యోగులు అవస్థలు పడుతున్నారు. అరకొర సౌకర్యాలతోనే ఏళ్ల తరబడి కొనసాగుతుండటంతో విధులు నిర్వహించడానికి అధికారులు, ఉద్యోగులు, వివిధ పనుల నిమిత్తం కార్యాలయాలకు వచ్చే ప్రజలు అసౌకర్యానికి గురవుతున్నారు. పాత భవనం కావడంతో వర్షం వచ్చినప్పుడు కురుస్తుంది కూడాను.

శిలాఫలకంతోనే సరి...

గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్)కు కేటాయించిన గ్రామ సమాఖ్య భవనం శిలాఫలకానికే పరిమితమైంది. మండలంలో 29 గ్రామ సంఘాలు ఉన్నాయి. వీటి పరిధిలోని 670 స్వయం సహాయక సంఘాల పరిధిలో 6,670 మంది మహిళలు సభ్యులుగా ఉన్నారు. భవన నిర్మాణం కోసం 2007లో అప్పటి ఎమ్మెల్యే రాంరెడ్డి వెంకటరెడ్డి సుజాతనగర్ అంగన్‌వాడీ–1 కేంద్రంలోని ఒకపక్కనున్న ఖాళీ స్థలంలో శంకుస్థాపన చేశారు. ఇందిరమ్మ పథకం రెండో విడతలో భవనాన్ని నిర్మించాలని నిర్ణయించారు. శిలాఫలకం వేసి సుమారు 13 ఏళ్లు కావస్తున్నా ఇంతవరకు సెర్ప్ భవన నిర్మాణం కార్యరూపం దాల్చలేదు. దీంతో డ్వాక్రా సంఘాల్లోని మహిళలు సభలు, సమావేశాలకు నానా ఇబ్బందులు పడుతున్నారు. కార్యాలయం లేకపోవడంతో చెట్ల కిందనే సమావేశాలను నిర్వహించాల్సి వస్తోంది.

ఊసేలేని వ్యవసాయశాఖ కార్యాలయం...

మండలంలో వ్యవసాయ శాఖకు సైతం కార్యాలయం లేదు. దీంతో ఆయా అవసరాల కోసం వచ్చే రైతులు వ్యవసాయాధికారులు ఎక్కడుంటే అక్కడికి వెళ్లి కలవాల్సి వస్తోంది. కార్యాలయాలు ఉంటే అధికారులు ఉంటారన్న నమ్మకం ఉండేది. నీటి పారుదలశాఖకు సంబంధించిన కార్యాలయం కూడా అద్దె భవనంలోనే కొనసాగుతోంది.

ఇంటర్ కళాశాలకు మోక్షమెన్నడో...

మండలం ఏర్పడి సుమారు తొమ్మిదేళ్లు కావస్తున్నా ఇంతవరకు ఇక్కడ ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఏర్పాటు చేయలేదు. పేద విద్యార్థులు పెద్ద చదువులు చదువుకోవాలనే ఆశ ఉన్నా.. ఇంటర్ కళాశాల అందుబాటులో లేకపోవడంతో సుదూర ప్రాంతాలకు వెళ్లి చదువుకోలేక మధ్యలోనే చదువులకు స్వస్తి చెబుతున్నారు. మండలంలో సుమారు 200 మందికి పైగా విద్యార్థులు ప్రతీ ఏడాది పదో తరగతి పూర్తి చేస్తున్నారు. ఇంటర్ చదవాలంటే కొత్తగూడెం, ఖమ్మం వెళ్లాల్సిందే. బాలికలను దూరం పంపేందుకు ఇష్టం లేని తల్లిదండ్రులు ఇంటికే పరిమితం చేస్తున్నారు.



గ్రామసమాఖ్య భవన నిర్మాణానికి ఏర్పాటు చేసిన శిలాఫలకం

ప్రజలు ఇబ్బంది పడుతున్నారు..



మండలంలో అన్నివర్గాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మండలంలో అన్ని ప్రభుత్వ కార్యాలయాలు ఒకే చోట ఉండేలా అధికారులు ప్రభుత్వానికి తగిన ప్రతిపాదనలు పంపాలి. కార్యాలయాల భవన నిర్మాణాల కోసం చర్యలు తీసుకోవాలి.

– జర్పుల కుమార్, సర్వారం

ఉన్నతాధికారులు స్పందించాలి..



మండలం ఏర్పాటై తొమ్మిదేళ్లు కావస్తోంది. ఇప్పటికీ ప్రభుత్వ కార్యాలయాలకు పక్కా భవనాలు ఏర్పాటు చేయకపోవడం సరైన విధానం కాదు. ఉన్నతాధికారులు స్పందించి ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణానికి కృషి చేయాలి.

– బచ్చలకూర శ్రీనివాస్, వేపలగడ్డ

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠ, ప్రత్యేక పూజలు



ఇల్లెందురూరల్: పూజ చేస్తున్న ఎమ్మెల్యే కనకయ్య



పాల్వంచరూరల్: పూజలో పాల్గొన్న భక్తులు



టేకులపల్లి: బేతంపూడిలో...

ఇల్లెందురూరల్: మస్సివాగు గ్రామపంచాయతీ ధర్మారం తండా గ్రామంలో ఆదివారం బంజారాల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్ విగ్రహాన్ని భక్తిశ్రద్ధలతో ప్రతిష్టించారు. ఈ వేడుకకు వేర్వేరుగా హాజరైన ఎమ్మెల్యే కోరం కనకయ్య, ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు, మాజీ ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ దిండిగల రాజేందర్, మార్కెట్ కమిటీ చైర్మన్ బానోత్ రాంబాబు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు దేవీలాల్‌నాయక్, రాంనాయక్, ఖమ్మంపాటి రేణుక, బానోత్ రవినాయక్, బోడ రమేష్, రాందాస్, బాబూలాల్, రాజు, శంకర్, కాసాని హరిప్రసాద్, మహేందర్ పాల్గొన్నారు.

సీతానాగారం కాలనీలో...

పాల్వంచరూరల్: బస్వతారక కాలనీ పంచాయతీ సీతానాగారం కాలనీలో ఆదివారం బొడ్రాయి, ముత్యాలమ్మ తల్లి, పాతురాజుల విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈనెల 21నుంచి మొదలైన పూజా కార్యక్రమాలు ఆదివారం ముగిశాయి. చివరిరోజు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. మార్క్‌ఫెడ్ డైరెక్టర్ కొత్వాల శ్రీనివాసరావు, ఉత్సవ కమిటీ సభ్యులు నామేపల్లి వెంకటేశ్వరరావు, మాలోతు కృష్ణ, సిరికొండ రవి, కేలోతు ప్రేమ్‌కుమార్, జయమ్మ, జి.శంకర్, చల్ల వెంకన్న, మహేష్, గంధం నర్సింహారావు, కె.వెంకన్న, ఏడీఈ వెంకటేశ్వరరావు, శ్రీకాంత్ తదితరులు పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు.

బేతంపూడిలో...

టేకులపల్లి: బేతంపూడి గ్రామంలో వెలిసిన శ్రీలక్ష్మీ నరసింహాస్వామి ఆలయంలో ఆదివారం విగ్రహాల ప్రతిష్ఠ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. ఆలయ కమిటీ, గ్రామపెద్దల ఆధ్వర్యంలో వేదమంత్రాల పఠనంతో నవగ్రహ విగ్రహాలతో పాటు ఆంజనేయ స్వామి విగ్రహం, శివలింగం ప్రతిష్ఠించారు. ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నప్రసాద వితరణ చేశారు. ఇల్లెందు, కొత్తగూడెం తదితర ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి పూజలు చేసి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.